భార్య
ఆధిపత్యానికి
జై పలికిన
ఆ భర్తలు
ఎలా మిగిలారు?

# అంభావిసం

సూర్య ప్రసాదరావు కథ

"పాకశాస్త్ర విద్యాప్రవీణా.. పరాక్... బహుపరాక్! అభినవ నలభీమ బిరుదాంకితా... జయహో! జయ జయహో!!"

నాలుగైదు కంఠాల నినాదాలతో స్టాఫ్ రూంలో ఓ మూల నోట్స్ రాసుకుంటున్న నేను తల ఎత్తి చూచి... ఏదో చెప్పేలోగానే...

లెక్కల 'ఆచారి' అన్నగారు అందుకోనే అందుకున్నారు. "అబ్బబ్బ! ఏమిట్రా ఆ గోల! మరీ చిన్నతనం వచ్చేస్తోంది. ప్రక్కన క్లాసులు... విద్యార్థులు... ఇక్కడ లేడీ లెక్చరర్లూనూ..."

"అన్నగారూ! అందరూ వెళ్లిపోయారు. ఈవెనింగ్ క్లాసులు కాన్సిలయ్యాయని నోటీసు వచ్చింది. మీరేమీ కంగారు పడక్కరలేదు" ఆ జవాబు కామర్స్ రాఘవది!

"ఇంతకూ ఏమిటీ విశేషం?" కుతూహలం పట్టలేక అడిగేశా.


"ఈరోజు మన ఎకనమిక్స్ సుబ్బారావు స్వహస్తాలతో నిమ్మకాయ పులిహోర చేశాడు.

కొంతమందికి వాడి పాకశాస్త్ర విద్యాప్రావీణ్యం తెలిసినప్పటికీ ఈ పూట అందరూ వాడి వంట రుచిచూడబోతున్నారు. అదీ విశేషం! శేషంలేని భాగహారం!!" అన్నగారిని చూస్తూ మరీ చెప్పాడు పాలిటిక్స్ గిరిధర్!

"వాడి ఇంటిదీపం కాజువల్ లీవులు తీసుకున్న శుభసందర్భంలో నన్నమాట ఈ అల్పాహార విందు". తన వంతు ఇంగ్లీష్ జగదీష్ పూర్తిచేశాడు.

"క్లాసులు లేవంటేనే... ఆకలి దంచేస్తోంది! త్వరగా తలాకాస్త పెట్టు సుబ్బారావ్! నీ ఋణం ఉంచుకోములే" హిస్టరీ అశోక్ అందరి ఆకలినీ రిప్రజెంట్ చేశాడు.

అందరి చేతుల్లో పేపర్ ముక్కలు వెలిశాయి. అందులో సుబ్బారావు... వాడి స్వహస్తాలతో చేసిన నిమ్మకాయ పులిహోర వడ్డించాడు. పులిహోర...



నిమ్మకాయ పులిహోర!!

కొద్ది క్షణాలు నిశ్శబ్దంగా పులిహోర రుచిని అనుభవించారు.

''ఆహా అద్భుతం! పరమాద్భుతం!! ఈ పులిహోర రుచిని వర్ణించు జిహ్వా జిహ్వా! దీని రుచి అత్యద్భుతము... అనన్య సామాన్యము! అమేయ ప్రతిభా వ్యుత్పత్తులు ప్రదర్శించిన సుబ్బారావు వరేణ్యా! నీకివే... నా కృతజ్ఞతాభివందనములు!!''

''అసలు... నలభీమ పాకం అని ఊరకే అన్నారా... మన పూర్వులు.. వంట చేస్తే మగవాడే చేయాలి... అద్భుతంగా! అంతేగానీ 'దమయంతీ, ద్రౌపదీ పాకం' అనలేదే. ఏ పనిలోనైనా మగవాడిదే పైచేయి!''

''మన గిరిధర్ అంటే... ఏదో అనుకున్నాను స్మీ! నిజంగా ఈ పులిహోర చాలా బావుంది. ఇంత ఘనత ఎలా నేర్చావ్... సుబ్బారావ్!'' మొదటిసారి వైస్ ప్రిన్సిపాల్‌గారు అడిగారు.

''వన్నడగండి సార్! నేను చెబుతాను. ఏదో ఉడతాభక్తిగా... ఇంట్లో చిన్న చిన్న పనులు తీరిక సమయాల్లో మాత్రమే చేస్తూ... ఇంతింతై వటుడింతై అన్నట్లు ఇలా... ఈ నాటికి మనవాడు వంట ఇంత అద్భుతంగా చేశాడు''

''జగదీష్! నీదు పలుకులలో పోతనామాత్యుని కవితలు హొయలొలుకుతున్నవి''

''బావుందిగానీ.... మనకూ ఈ మహద్భాగ్యం అబ్బేదెలా?''

అడుగుతున్నప్పుడే ఆచారి అన్నగారి కనులముందు గాడిపొయ్యి... దానిపై గుండిగలు... ఒక దానిలో అన్నం... మరో దానిలో పప్పు కలియబెడుతూ... జంధ్యంతో చెమట తీస్తుకుంటూ... తను మహదానందం పడుతుంటే.... అందరూ తన వంటను మెచ్చుకుంటూ... పంక్తి భోజనాలు చేస్తుంటే... ఆ ఆనందం ద్విగుణీకృతమవుతోంది.

''అబ్బే! పెద్ద కష్టమేమీ లేదు అన్నగారూ! ఓ సంఘాన్ని స్థాపించుకోవడమే... దానిపేరు 'అభావిసం...' విడమరిచి తరువాత చెబుతా. అప్పుడు మనం వంట నేర్చుకోవచ్చు. చక్కగా చేయవచ్చు. పదిమందికీ ఇంత పెట్టవచ్చు... మనం ఇంత తినవచ్చు...''

''స్టౌ అంటించడం సైతం చేతకాని నాకు కూడా వంటచేయడం వస్తుందా?'' పౌరశాస్త్రం పురుషోత్తమ్‌కు పెద్దసందేహమే వచ్చింది.

''నిస్సంశయముగా... నిస్సందియముగా... నిస్సంకోచముగా'' శాస్త్రి సమాధానం చెప్పాడు.

''పేరయితే బావుందికానీ... దాని సభ్యులకు కావలసిన క్వాలిఫికేషన్స్ వగైరాలు మరి... చెప్పండర్రా!'' అన్నగారికి సంబరం వచ్చినా కోపం వచ్చినా పట్టలేము.

''చెబుతాను వినండి!'' ఆ కంఠం రాఘవది.

''నేనునూ నుడివెద...'' శాస్త్రికూడా పోటీ పడ్డాడు.

''అంటే నువ్వుకూడా దీని ఫౌండేషనుకు...'' అన్నగారి వాక్యం పూర్తికాలేదు.

''మూలకారకుండను కానని సందియమా!'' శాస్త్రికి ఆత్మాభిమానం దెబ్బతిన్నట్లయింది.

''నేనే ఆరంభించెద... ప్రాథమిక లక్షణం పత్నితో తప్పితే... ఎప్పుడూ ఒంటరిగా విపణి వీధిలో కనిపించరాదు...''

''నంబర్ టు! సినిమాకుగాని, షికారుకుగాని ఒంటరిగా వెళ్లరాదు'' రాఘవ క్వాలిఫికేషన్స్ ఒకటొకటీ వివరిస్తున్నాడు.

''ముచ్చటగా మూడవది! ఎట్టి స్థితియందునా భార్యానుమతి పొందనిదే బయటకు ఏగరాదు''

''నంబర్ ఫోర్! తప్పనిసరై ఒంటరిగా వెళ్లవలసివస్తే... భార్యకు స్పష్టంగా చెప్పాలి... ఎక్కడకు వెళ్లేదీ... ఎప్పుడు తిరిగి వచ్చేదీ...''

''ఐదవది! ఆరోగ్యమును భంగము చేయు అలవాట్లపై... మీదుమిక్కిలి... ఆవిడ అదుపు తప్పకుండా వుండవలె...''

''నంబర్ సిక్స్! చాలా ఇంపార్టెంట్!! జీతం వచ్చిన వెంటనే అంతా ఆవిడ చేతిలో పెట్టాలి. ఆవిడ ఇచ్చే పావలో, అర్థో పాకెట్‌మనీ క్రింద తీసుకోవాలి''

''ఏడవది! భార్యను ఎప్పుడూ చివాటులు వేయరాదు... గృహమునందునా... గృహము

వెలుపలా''

''నంబర్ ఎయిట్! ఇంట్లో వున్నంతసేపూ అన్ని పనులలో ఆవిడకు తలలో నాల్కలా మెలగాలి''

''తొమ్మిదవది! పిల్లలతో ఆడుకొనవలె... ఆడించవలె... ఏడవకుండా చూడవలె...''

''నంబర్ టెన్! పిల్లలతో షాపింగ్‌కు వెళ్లడానికి వీలుపడకపోతే... పిల్లలను తాను దగ్గర వుండి చూచుకోవాలి. షాపింగ్‌కు ఆవిడను పంపించాలి!. వీటిలో ఎక్కువ క్వాలిఫికేషన్స్ ఎవరికుంటే వారు ప్రెసిడెంట్... రెండవ స్థానం సెక్రటరీ...'' రాఘవ ముక్తాయింపుకు వచ్చేశాడు.

''ఈ స్థానములు అవశవ్యము మీకు వశ్యముగావలె!'' శాస్త్రి ఆకాంక్ష.

''కనుగొన్నవారిమి మేము కనుక నాకు వైస్‌ప్రెసిడెంట్‌షిప్... శాస్త్రికి జాయింట్ సెక్రటరీ పదవి... ఇప్పటికి అందరికీ అర్ధమై వుంటుందనుకుంటాను... 'అంభావిసం' అంటే... అంతర్జాతీయ భార్యా విధేయుల సంఘం.''

అయితే నాకు సెక్రటరీ పదవి''

''నాకు సాధారణ సభ్యత్వం''

''నాకు కోశాధికారి పదవి.''

నాతో సహా ముగ్గురం మూడు రిక్విజిషన్స్ పడవేశాం.

''నాకైతే ఏ సభ్యత్వమూ వద్దు! అసలు ఆడదానికి అన్ని స్వాతంత్ర్యాలు ఇచ్చేసి వాళ్లమీద ఆధారపడి జీవించడంకన్నా హీనంలేదు''

ఈ మధ్యనే జంతుశాస్త్రంలో డాక్టరేట్ పుచ్చుకున్న డాక్టర్ హరిశ్చంద్ర కంఠం స్టాఫ్ రూం నాలుగు గోడల్ని పలకరించి వస్తోంది.

''అసలు సృష్టిలోనే మగజీవి ఆధిక్యత కనబడుతోంది. కమ్మగా పాడే కోయిల మగది. మేఘాలను చూచి పురివిప్పి నాట్యం చేసే నెమలి మగది. అందాకా ఎందుకు... మనం రోజూ చూచే కోళ్లలో పెట్టకంటే పుంజే బహు చక్కగా వుంటుందని నేను చెప్పనక్కరలేదనుకుంటాను. మగ ఆధిక్యతను ఆడ ఆధిక్యతగా మార్చివేయాలనుకునే మీ అభిప్రాయంతో నేను ఏకీభవించను''

స్టాఫ్‌రూంలో గుండు సూది వేస్తే వినిపించేంత నిశ్శబ్దం!

## సెంట్ల సేకరణ



కొందరికి నాణేలు సేకరించడం హాబీ! అమెరికాలోని ఒకిమో రాష్ట్రానికి చెందిన దిల్లియాన్ విల్లేలో ఉన్న ఓ బార్ యజమాని లూయిస్ స్టాఫిలోనాకు ఇలాంటి అలవాటు వుంది! 65 సంవత్సరాలు ఆయన సేకరించిన ఒక సెంటు నాణాలు కుప్పలా పెరిగిపోవడంతో బ్యాంకుకు వెళ్లి క్యాష్ చేసుకుందామనుకున్నాడు. వాటిని ట్రక్కులలో బ్యాంక్‌కు తరలించడానికి నాలుగు రోజులు పట్టింది. రెండు నెలలు ఉద్యోగులు వాటిని లెక్కించారట! సో.. ఏది ఏమైతేనేం... సేకరణ పుణ్యమా అని... ఉన్నట్లుండి స్టాఫిలోనా ధనవంతుడైపోయాడట! కాకపోతే అన్ని నాణాలు సర్క్యులేషన్‌లోంచి బయటకు తీసి దాయడం ఓ రకంగా చెప్పాలంటే దేశద్రోహమే!

- జూపిటర్

''ఆడదై పుట్టిన తరువాత ఇంటి పనంతా ఆవిడే చేయాలి. బజారు పని నేను చూడాలి. ఆవిడ నేను గీచిన గీత దాటరాదు. అందువల్ల మీరు పెట్టబోయే ఈ అంభావిసంకు నాకు ఎటువంటి సంబంధమూ లేదు''

క్షణాలు యుగాల్లా గడుస్తున్నాయి.

మా గుండెల చప్పుళ్లు మాకే వినిపిస్తున్నాయి.

''అయినచో... మన ఆలోచనలకు తిలోదకాలర్పించవలసినదేనా... కటకటా... ఎన్ని ఇక్కట్లు దాపురించబోవుచున్నవి'' శాస్త్రి గొంతు నిశ్శబ్దాన్ని భంగం చేసేసింది.

''మన సంఘానికి ప్రెసిడెంట్ కరువా?'' రాఘవ గొంతులో దైన్యం.

''ఇఫ్ యు డోంట్ మైండ్... మీకు అభ్యంతరం లేకపోతే... లెట్ మీ ఎవైల్ దిస్ ఆపర్చ్యూనిటీ! నన్ను ఈ అవకాశాన్ని వినియోగించుకోనివ్వండి''

తెల్లని జుట్టు, నల్ల ఫ్రేమ్ కళ్లద్దాలు, నల్లకోటు విశేషాలుగా గల వైస్ ప్రిన్సిపాల్‌ను నోళ్లు వెళ్లబెట్టి చూడడం మా వంతయింది.

''మాస్టారూ... మీరు...'' ఆశ్చర్యం నా నోట్లో వుండలేకపోయింది.

''కనీసం ఒక్కసారైనా... అమ్మగారితో బజార్లో కనిపించలేదు'' రాఘవ సందేహం.

''సినిమాహాలులో సైతం మీ సకుటుంబ దర్శనం మాకెన్నడూ కాలేదు'' జగదీష్ ధర్మసందేహాన్ని వెలిబుచ్చాడు.

మిమ్ములను సకుటుంబ బంధుమిత్ర సపరివార సమేతముగా గృహంబునందు తక్క మరెచ్చోటనైనా కమనీయముగా వీక్షించినవారికి నూట పదునారు రూప్యములు బహుమానమిత్తుమని ప్రకటన వెలువరించినట్లు ఒకప్పటి స్మృతి!'' శాస్త్రి పొగడ్తలకు మాత్రం వైస్‌ప్రిన్సిపాల్‌గారు పొంగిపోలేదు.

''నిజమే శాస్త్రీ! నువ్వన్నట్టు నేనెప్పుడూ సకుటుంబంగా బజార్లో కనిపించలేదు. సతీ, సుత సమేతంగా ఏ ఫంక్షన్‌కూ హాజరుకాలేదు. అలాగని... ఇంట్లో ఆడవాళ్లకు చేదోడు వాదోడుగా వుండని మగవాడెవడైనా వుంటాడా? అసలు రాఘవే అనుమతిస్తే ఫౌండర్ ప్రెసిడెంట్ అయి వుండేవాడిని. ఇదేమీ ఇక్ష్వాకుల కాలం కాదయ్యా. ఇరవయ్యో శతాబ్దపు అంచున నిలబడి వున్నాం. స్త్రీ స్వాతంత్ర్యం కావాలని గగ్గోలు పెట్టే రోజులివి! ఇంకా స్త్రీని బానిసగా చూచే అలవాటు... చదువుకున్న, చదువు చెప్పే మనబోటి వాళ్లకే వుంటే... మిగిలిన వాళ్లు స్త్రీని ఎలా చూస్తారో చెప్పనక్కరలేదు. నేనిలా అంటున్నానని ఎవరూ వ్యక్తిగతంగా భావించి బాధపడనక్కరలేదు.'' ఒక్కసారి ఆయన డాక్టర్ హరిశ్చంద్రవైపు చూచి మళ్లీ ప్రారంభించారు.

''వివాహమైన కొత్తలో నేనూ హరిశ్చంద్రలానే అనుకునేవాడిని. కానీ ఒంటికాలిమీద నడక లేదు. కేవలం ఇంటి బాధ్యతంతా ఇల్లాలిమీదే మోపితే ఒకవైపు ఆవిడ ఇంటిపని చూచుకోవాలా... ఓ వైపు పిల్లలను చూడాలా... మరోవైపు భర్తను చూచుకోవాలా! ఆవిడకున్నది ఒక్కటే మెదడు. రెండే కాళ్లు. రెండే చేతులు! అందుకే భర్త ఇంట్లో వున్న సమయంలోనైనా భార్యకు సహకారాన్నందిస్తే... ఆవిడకూ కొంత రిలీఫ్ దొరుకుతుంది. సంసారం సాఫీగా నడుస్తుంది. ఆ విధంగా ఆవిడకు సహాయం చేస్తే దాస్యం చేసినట్లూ కాదు. మగవాడి గొప్పతనమేదో తగ్గినట్లూ కాదు'' సహజధోరణిలో సాగిన ఆయన ఉపన్యాసంలో మమ్మల్ని మేము మరచిపోయాం.

''చాలా బాగా చెప్పారు మాస్టారూ! మీ సదుద్దేశాల్ని దృష్టిలో వుంచుకునే మేం ఈ సంఘాన్ని స్థాపించుదామనుకున్నది'' రాఘవ ఉత్సాహానికి ఊపిరి వచ్చేసింది.

''మంచిది రాఘవా! చిన్నవాడివైనా పెద్ద

బుద్ధితో ఆలోచించావ్! భార్యాభర్తలిద్దరూ రెండు చక్రాలైతేనే సంసారపు బండి సజావుగా సాగిపోతుంది. మీ సదుద్దేశానికి నా శుభాకాంక్షలు ఎప్పుడూ వుంటాయి'' వైస్ ప్రిన్సిపాల్‌గారు హామీ ఇచ్చారు.

''అందుకేనేమో... సత్యాపతిననీ... సత్యభామా విధేయుడిననీ... అప్పుడే కృష్ణ పరమాత్మ కుప్పలు తెప్పలుగా గప్పాలు కొట్టినాడు. అంతటితో ఆగెనా... ఆమె వామపాద తాడనమునకు పులకితగాత్రుడై మత్తను పులకాగ్ర కంటక వితానము తాకిన నొచ్చునంచు నేననియెంద... అల్కమానవుగదా... అని ఊరుకొనెనా...''

''శాస్త్రీ నీ వూరకొన్ననూ నేనూరుకోను. ఇప్పుడే అంభావిసం సభ్యుల పేర్లు, క్వాలిఫికేషన్లకు కొద్ది రాయితీలు ప్రకటిస్తా...'' రాఘవ ఉత్సాహానికి పట్టపగ్గాలు లేకుండా పోయింది.

''వైస్ ప్రిన్సిపాల్‌వంటివారే ప్రెసిడెంట్‌షిప్ స్వీకరించడానికి సిద్ధపడ్డప్పుడు కార్యదర్శి పదవే... నా ఫస్ట్ ప్రిఫరెన్స్! ఒక పిల్ల పెళ్లి చేసినప్పటికీ... నేనింకా యువకుడిననే ఫాల్స్ ప్రిస్టేజీతో ఫాల్స్ ఈక్వేషన్ వర్కౌవుట్ చేశా'' ఆచారి అన్నగారి కన్ఫెషన్‌కు మాకెంతో ఆశ్చర్యమేసింది.

''అయితే... ఆచారి అన్నగారికే... కార్యదర్శి పదవి. నేను నా అప్లికేషన్ ఉపసంహరించుకుంటున్నా'' అభ్యర్థి రంగంనుండి తప్పుకున్నాడు.

''అందరూ ఎప్పుడో ఒకప్పుడు... ఎచ్చటో ఒకచోట... భార్యావిధేయులే! నేను భార్యావిధేయుడను కానని నొక్కి వక్కాణించువాడే గృహంబందు మిక్కిలి విధేయుడు. భార్యావిధేయుండను కానని బుకాయించువాడే మొదట మన సంఘంలో సభ్యుడు. అన్నటుల మన సంఘమునకు ఎద్దియో చిహ్నము...''

శాస్త్రికి కాన్ఫిడెన్స్ వచ్చేసింది.

''ఎంబ్లెమ్... అని ఏడవరాదూ!'' జగదీష్ సర్దుబాటు చేశాడు.

''అదియే... ఎంబ్లెమ్ కావలయును కదా? అందు సత్యభామాదేవీ... ఆమె వామపాదమూ... దాని నెదుండు మోకరిల్లిన శ్రీకృష్ణ భగవానుని రత్నఖచిత సహిత శీర్షమూ... అది తాకిన అవనత శీర్షమూ... అద్భుతముగా ఉండారుగద!''

''కదా... అని మెల్లగా అంటావేమిటి శాస్త్రీ! అదే... అదే... మన ఎంబ్లెమ్! అయితే... వైస్ ప్రిన్సిపాల్‌గారూ! మన అంభావిసం ప్రారంభోత్సవం అద్భుతంగా జరగాలి. అధిక వ్యయప్రయాసలైనా... ప్రమాణ స్వీకార మహోత్సవం ఘనంగా జరగాలి. ఆ బాడ్జీలు... ఆ సందడీ... ఆ అలంకరణలూ వగైరాలు... అందంగా....''

''ఫుల్‌స్టాప్ రాఘవా!! అప్పుడే మరచిపోతున్నావ్! ప్రారంభం చేయబోయేదేమో 'అంభావిసం'. ఇంటివాళ్లను సంప్రదించకుండా, వారి అనుమతి లేకుండా భారీ ఎత్తున ప్రారంభోత్సవ సన్నాహాలూ, సంబరాలూ... అన్నీ నీ ఇష్టమే! ఆలోచించుకో.. నేనైతే సభ్యత్వ రుసుముకూడా మా ఇంటి దీపాన్ని సంప్రదించిగానీ ఇవ్వదలచుకోలేదు. ఈ అధ్యక్షపదవికూడా... అంటే ఆవిడ అనుమతి లభించిన తరువాతే ఖరారు చేసేది. తరువాత మీ ఇష్టం!!''

వైస్ ప్రిన్సిపాల్‌గారి కన్ఫెషన్‌కు స్టాఫ్‌రూమంతా నవ్వులతో నిండిపోయింది.

క్లర్క్ హరిశ్చంద్ర సీటువైపు చూద్దుముగదా... ఎప్పుడు బయటకు జారుకున్నాడో!!

అంకితం : మా శీలం సిద్ధారెడ్డి శ్రీజ్యోతి కళాశాల, ఖమ్మం.... స్టాఫ్‌రూంలో రూపుదిద్దుకున్న ఈ కథ మా స్టాఫ్ మెంబర్లకే అంకితం!